నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
5 సెప్టెంబర్ 2026

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ 1,000 రోజుల సంక్షేమ పాలనపై సంబరాలు

## 600కు పైగా బైక్‌లతో భారీ ర్యాలీ





**కొడిమ్యాల, సెప్టెంబర్ 04,(నవగీతం)** కొడిమ్యాల మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1,000 రోజుల సంక్షేమ పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా పాలన సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాల మైదానం నుండి అంగడి బజార్ చౌరస్తా మీదుగా పూడూరు చౌరస్తా వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. సుమారు 600కు పైగా ద్విచక్ర వాహనాలతో నిర్వహించిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు.ఎన్ని కుట్రలు చేసినా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఆగవని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, 43 లక్షల మందికి చేయూత పింఛన్లు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇవి ప్రజా పాలనకు నిదర్శనమన్నారు.చొప్పదండిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, రామడుగులో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్, గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల,కొడిమ్యాల--మల్యాల ప్రధాన రహదారుల అభివృద్ధి, కొండగట్టు- నాచుపల్లి ప్రాంతానికి జేఎన్‌టీయూ యూనివర్సిటీ హోదా, నారాయణపూర్ కుడికాలువ పూర్తి చేయడం,కొడిమ్యాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేస్తున్నామని తెలిపారు.చొప్పదండి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కంకణబద్ధులమని అన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 1,000 రోజుల సంక్షేమ పాలన పూర్తి చేసుకోవడం సంతోషకరమని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి సాధిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు.కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, ప్రజలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొడిమ్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోగూరి నాగభూషణ్ రెడ్డి, గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్ లు మార్కెట్ కమిటీ చైర్మన్,లు సింగిల్ విండో చైర్మన్లు,కాంగ్రెస్ నాయకులు,యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీ సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

# బీసీలకు న్యాయం చేయకపోతే ప్రజలే సమాధానం చెబుతారు .

## దొగ్గలి శ్రీధర్ ఆర్ టి ఐ రాష్ట్ర అధ్యక్షులు



**కరీంనగర్,సెప్టెంబర్4,(నవగీతం):** కొండా సుస్మిత మాట్లాడిన మాటలకు మంత్రి కొండా సురేఖ ని బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసం ? తప్పు ఎవరు చేశారో నిర్ధారించి వారిపై చర్యలు తీసుకోవాలి.కానీ తప్పు చేయని వ్యక్తిపై రాజకీయ బాధ్యత మోపి మంత్రి పదవి నుంచి తొలగించడం సరైన విధానం కాదు. కొండా సురేఖ విషయంలో తీసుకున్న నిర్ణయానికి ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలి. ఆమె తీసుకునే న్యాయబద్ధమైన నిర్ణయాలకు మద్దతుగా నిలుస్తాం అని అన్నారుక్రమశిక్షణ చర్యల్లో కులం, వర్గం, రాజకీయ పలుకుబడి ఆధారంగా ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదు. ఒక వర్గానికి ఒక న్యాయం, బీసీలకు మరో న్యాయం అన్న భావన కలిగితే అది ప్రభుత్వ విశ్వసనీయతకే నష్టం. బీసీ సంఘాలు,కుల సంఘాలు కూడా ఇలాంటి సందర్భాల్లో మౌనం వీడి బీసీల హక్కుల కోసం గట్టిగా ప్రశ్నించాలి అని కోరారు.కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన 42% రిజర్వేషన్ల హామీ ఏమైంది? బీసీలకు కేవలం పదవులు ఇచ్చామని చెప్పడం కాదు-నిర్ణయాధికారం, కీలక శాఖల్లో సముచిత ప్రాతినిధ్యం, రాజకీయ మరియు ఆర్థిక సాధికారత కల్పించాలి. ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణను ప్రజల ముందుంచాలి.బీసీలు ఎవరికీ ఓటు బ్యాంకు కాదు.బీసీలకు కావాల్సింది మాటలు కాదు -వాటా, హక్కు అధికారం!హామీలు ఇచ్చి విస్మరిస్తే ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తాం... ప్రజలే తగిన సమాధానం చెబుతారు అని అన్నారు.

# 1000 రోజుల దగాకోరు కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ పోరుబాట





**ఇబ్రహీంపట్నం ,సెప్టెంబర్4,(నవగీతం):** ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మరియు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా, వంటావార్పు ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, 1000 రోజులు గడిచినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మండిపడ్డారు.ముఖ్యంగా మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల ముందు చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న పనులకు పొంతన లేదని అన్నారు.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఏమయ్యాయని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దొంగ హామీలను, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఎమ్మెల్యే సంజయ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు...

# అక్రమ పట్టాలకు అధికారుల ఆసరా?

**ప్రభుత్వ భూముల్లో గిరిజనేతరుల పాగా.**

**అక్రమ పట్టాలపై చర్యలు తీసుకోవాలి.**

**గోండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షుడు పూనేం ప్రతాప్ డిమాండ్.**



**ములుగు,సెప్టెంబర్ 03(నవగీతం)** నూగూరు వెంకటాపురం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల అక్రమ పట్టాలను తక్షణమే రద్దుచేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షుడు పూనేం ప్రతాప్ డిమాండ్ చేశారు.వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్‌డబీ గెస్ట్ హౌస్ ఆవరణలో గోండ్వానా సంక్షేమ పరిషత్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు పూనేం ప్రతాప్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరుల భూ బదలాయింపులను నిరోధించే 1/70 చట్టం అమలులో ఉన్నా రెవెన్యూ అధికారులు ఆ చట్టాలను ఖూనీ చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు.ఏజెన్సీ భూములు గిరిజనేతరల పరం కాకూడదనే ఉద్దేశంతో నాటి ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఎల్టీఆర్, 1/70, పీసా చట్టాలను అధికారులే ఉల్లంఘిస్తున్నారని మండిపడ్డారు. వెంకటాపురం మండలం మరికల (జెడ్) గ్రామంలో అనేక భూ అక్రమాలు జరిగాయని, సర్వే నెంబర్లు 123, 122, 120 లలో గల వందల ఎకరాల ప్రభుత్వ భూములను గిరిజనేతరులకు అక్రమంగా పట్టాలు చేశారని ఆరోపించారు.డిజిటల్ రికార్డులను తారుమారు చేస్తూ, ధరణిభూభారతి రికార్డుల్లో నిబంధనలకు విరుద్ధంగా గిరిజనేతరుల పేర్లను నమోదు చేస్తూ అధికారులే అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పత్రాలతో 1/70 నిబంధనలు ఉల్లంఘించి హక్కు పత్రాలు పొందిన విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా ఎందుకు మౌనం వహిస్తున్నారని, ఇది సిగ్గుచేటని ఎద్దేవా చేశారు.ఈ అక్రమ పట్టాల విషయమై మండల రెవెన్యూ అధికారికి (తహసీల్దార్) ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని, పట్టింపే లేకుండా వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమేనని అన్నారు. త్వరలో ఈ అక్రమ పట్టాలపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి పట్టా మార్పిడిని సవాల్ చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తాటి రాజేష్, తాటి లక్ష్మయ్య,భీమయ్య, సిద్దు, చంటి, కొమరయ్య, రమేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు 35మంది ప్రభుత్వ ఉపాధ్యాయుల ఎంపిక

**కరీంనగర్, సెప్టెంబర్ 4(నవగీతం):**2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి కరీంనగర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు 35 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి ఈఓ శ్రీమతి చైతన్య జైనీ ప్రకటించారు.విద్యార్థుల అభ్యసన ఫలితాల మెరుగుదల,వినూత్న బోధనా పద్ధతుల అమలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయడం, పాఠశాల అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించడం,ప్రభుత్వ విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం తదితర అంశాలలో విశేష ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను జిల్లా ఉత్తమఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5వ తేదీన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైన 35 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించేందుకు ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు డి ఈ ఓ శ్రీమతి చైతన్య జైనీ తెలిపారు.

## గోదురు మాస్టర్ కాన్వెంట్ స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్4,(నవగీతం):** ఇబ్రహీంపట్నం మండలంలోని గోదురు గ్రామంలోని మాస్టర్ కాన్వెంట్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముద్దుగా ముస్తాబై చూపరులను ఆకట్టుకున్నారు.చిన్నారుల అందమైన వేషధారణతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం విద్యార్థులు నృత్యాలు, కోలాటాలు, వివిధ ఆటలతో సందడి చేస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. చివరగా సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాత్‌పడి పురుషోత్తం, ఉపాధ్యాయులు పావని, స్వప్న,దివ్య, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలో చేసిన సందడి అందరినీ ఆకట్టుకుంది.

## కోరుట్ల మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నాకు జనసేన పార్టీ నాయకుల మద్దతు



**కోరుట్ల, సెప్టెంబర్4,(నవగీతం)** జీవో 1181 రద్దు చేయాలని కోరుట్ల మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వారి విధులు బహిష్కరించి మున్సిపల్ ఆవరణలో బైఠాయింపు చేపట్టారు, వారికి మద్దతుగా కోరుట్ల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు వెళ్లి సంఘీభావం తెలిపి పూర్తి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా యువ నాయకులు సాయి కృష్ణ మాట్లాడుతూ 1181 జీవో వలన కేవలం కోరుట్ల పట్టణంలోని మున్సిపల్ లో 36 మంది ఉద్యోగుల వేతనంలో తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఒక్కొకరికి రూ 1000 నుండి 6500 వరకు కోతలు విధించబడుతున్నాయి అని వారు 10 నుండి 20 సంవత్సరాలుగా సేవలు అందిస్తూ వారి ఉద్యోగం ఎప్పుడూ రెగ్యులరైజ్ అవుద్దో అని ఎన్నో ఆశలతో నిరీక్షిస్తూ ఉంటే నేడు రాష్ట్ర ప్రభుత్వం వారి నడ్డి విరిచినట్టు దుర్మార్గపు చర్యలు చేయడం చాలా దారుణమని, ఇంతటి కష్ట కాలంలో జీతాలు పెంచాలి కానీ తగ్గించడం చాల అన్యాయమని తెలిపారు. ఇప్పటికైనా వారికి మద్దతుగా ఈ జీవోను ఉపసంహరించి రాష్ట్రంలోని ఏ మున్సిపల్ ఉద్యోగులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేయొద్దు అని రాష్ట్ర ముఖ్యమంత్రి,రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి రేవంత్ రెడ్డి ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు గుమ్లాపూర్ గ్రామ వార్డు మెంబర్ అడ్లగట్ట సురేష్, యూసుఫ్ నగర్ ఉప సర్పంచ్, కోరుట్ల ఉప సర్పంచ్ ల ఫోరం ఉప అధ్యక్షులు బసవేని రమేష్, వీర మహిళలు కవిత, లహరి, జనసైనికులు రాజేందర్, శశి, శ్రీనివాస్, సాయి, భాస్కర్ లు పాల్గొన్నారు.

## పోలీస్ ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్‌గా హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ



**కొడిమ్యాల సెప్టెంబర్ 04(నవగీతం)** రాజన్న సిరిసిల్ల జిల్లా సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్‌లో ఇటీవల నిర్వహించిన పోలీస్ ఎన్నికల్లో గంగాధర మండలం కాసారం గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ లయన్ రామకృష్ణ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం పనిచేసే బాధ్యతాయుతమైన పదవికి రామకృష్ణ ఎన్నిక కావడం పట్ల తోటి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా 17వ బెటాలియన్ కమాండెంట్ పి.జె.పి.సి. చటర్జీ రామకృష్ణను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బందికి అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన పోలీస్ సిబ్బందికి రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. సిబ్బంది సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.రామకృష్ణ ఎన్నిక పట్ల కాసారం గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

